16 నుంచి హైలైఫ్ ఎగ్జిబిషన్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నటీమణులు ప్రీతి, ప్రియాంక, స్రవంతి

బంజారామిల్స్: ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే హైలైఫ్ లైఫ్ స్టైల్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ ఈ నెల 16, 17, 18 తేదీల్లో హెచ్ఐసీసీ నోవాటెల్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమం బంజారాహిల్స్ రోడ్ నెం. 10లో జరిగింది. కార్యక్రమంలో పలువురు నటులు ప్రియాంక, ప్రీతి, స్రవంతితో పాటు మోడల్స్ పాల్గొని కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ... క్రియేటివ్ ఫ్యాషన్ వేర్‌తో పాటు బ్రైడల్ వేర్, డిజైనర్ వేర్, విభిన్న రకాల జ్యువెలరీని ఈ ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.

ఘనంగా శంకర జయంతి



పూజల్లో పాల్గొన్న వేద పండితులు, వేద విద్యార్థులు

వెంకటేశ్వరకాలనీ: శ్రీ జగద్గురు ఆది శంకరాచార్య జయంతి వేడుకలు శ్రీనగర్‌కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 12వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఈ వేడుకలను నిర్వహించనున్నట్లు వేద పండితుడు చేబియ్యం జ్యోతిశ్చంద్ర శర్మ తెలిపారు. ఈ సందర్భంగా అధర్వణ వేద స్వాహాకార కార్యక్రమం నిర్వహించారు. లోక కళ్యాణం కోసం ఆదిశంకరాచార్యస్వామి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈవో లావణ్యతో పాటు శ్రీ విజయ శంకర దేశిక పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వేగశ్రీ డైమండ్ జ్యువెలర్స్‌లో ఘనంగా అక్షయ తృతీయ



అక్షయ తృతీయ వేడుకల్లో వేగశ్రీ జ్యువెలరీ బృందం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయం ఎదురుగా ఉన్న వేగశ్రీ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో అక్షయ తృతీయ వేడుకలు ఘనంగా జరిగాయి. వేగశ్రీ యజమానులు నవీన్ కుమార్ వనమా, మణిదీప్ ఏచూరి, కల్యాణ్ కుమార్ గొల్ల ప్రత్యేక డిజైన్ల ఆభరణాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలు ఆఫర్లు ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు ప్రకటించారు. రూ. 2 లక్షలు, ఆ పైన ఆభరణాల కొనుగోలుపై ఒక గ్రాము గోల్డ్ కాయిన్ ఉచితంగా అందిస్తామని తెలిపారు.

సౌందర్యసాధన కోర్సులతో యువతకు ఉపాధి



మేకప్ నైపుణ్యాలను వివరిస్తున్న మేకప్ నిపుణుడు జావేద్ హబీబ్

శ్రీనగర్‌కాలనీ: హైదరాబాద్ నగరం బ్యూటీకేర్, ఫ్యాషన్‌కు అడ్డాగా మారిందని, బ్యూటీ కోర్సులు నిరుద్యోగులకు స్వయం ఉపాధిని కల్పిస్తూ మరింత మందికి ఉపాధి అవకాశాలను అందిస్తాయని ప్రముఖ హెయిర్ అండ్ బ్యూటీ నిపుణులు జావేద్ హబీబ్, జియా సాస అన్నారు. నగరంలోని పలుచోట్ల ఇండియన్ బ్యూటీ అసోషియేషన్, మెయిర కాస్మొటిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్బీ ఇన్నోవేషన్స్ పేరిట మేకప్ సెమినార్, వర్క్‌షాప్స్, కల్చరల్ ప్రోగ్రామ్స్‌ను నిర్వహించారు. ఇలాంటి సెమినార్స్ ద్వారా కొత్త ఫ్యాషన్స్, మేకప్ నైపుణ్యాలు, స్వయం ఉపాధి అవకాశాలకు దోహదపడతాయని ఐబీఏ వ్యవస్థాపకుడు వంశీకృష్ణ తెలిపారు. మేకప్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బ్యూటీషియన్స్‌కి అవార్డులను అందజేశారు.

కేంద్రంలో వచ్చేది ఇండియా కూటమే..



భగత్‌సింగ్‌కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న సుజాత పాల్

ఫిలింనగర్: కేంద్రంలో ఈ సారి ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఏఐసీసీ స్పోక్స్ పర్సన్, ఏఐసీసీ కమ్యూనికేషన్ కో ఆర్డినేటర్ సుజాత పాల్ అన్నారు. శుక్రవారం ఆమె ఫిలింనగర్‌లోని భగత్ సింగ్ కాలనీ, మాగంటి కాలనీల్లో కాంగ్రెస్ నేత, అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇచ్చే గ్యారంటీ పథకాలపై స్థానికులకు వివరించారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ నేతలు చెప్పే గారడి మాటలు విని మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నేత బి.ఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోరబండ పీఎస్‌కు గుంపులుగా రావొద్దు

రహమత్‌నగర్: బోరబండ పోలీస్ స్టేషన్ రాకపోకలపై ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ ఆంక్షలు విధించారు. గుంపులుగుంపులుగా రాకుండా ప్రధాన ద్వారం వద్ద నిలిపి వేయాలని పోలీసులకు ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులతో పాటు ఒకరు లేక ఇద్దరిని మాత్రమే అనుమతించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. స్టేషన్‌కు పదుల సంఖ్యలో జనం వస్తుండటంతో పోలీసుల విధి నిర్వహణకు అంతరాయం ఏర్పడుతున్నదన్నారు.

ఆత్మహత్య చేసుకుంటానని అక్కకు ఫోన్ చేసి.. చెల్లెలు అదృశ్యం

వెంగళరావునగర్: తాను డ్యూటీకి వెళ్లివచ్చేలోగా తన సోదరి కనిపించలేదంటూ ఓ మహిళ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. రహమత్‌నగర్‌లో ఎస్.పద్మ, మహేష్ దంపతులు నివాసంఉంటున్నారు. బుధవారం పద్మ చెల్లెలు మౌనిక అక్క ఇంటికి వచ్చింది. రాత్రి పద్మ తన చెల్లి ఫోన్ చెక్ చేయగా మధు అనే వ్యక్తితో స్నేహం ఉన్నట్టుగా గుర్తించిన పద్మ ఆమెను మందలించింది. పెద్దలతో మాట్లాడి అతడితోనే పెళ్లి చేస్తామని హామీ ఇచ్చింది. గురువారం పద్మ డ్యూటీకి వెళ్లివచ్చేసరికి చెల్లెలు తన ఫోన్‌ను ఇంట్లో పెట్టి వెళ్లిపోయింది. అదేరోజు రాత్రి తన బావకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి ఫోన్ కట్ చేసింది. దీంతో పద్మ మధుకు ఫోన్ చేయగా అతను లిఫ్ట్ చేయకపోగా కొద్దిసేపటికి స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. దీంతో పద్మ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా సాధికారతే బీజేపీ లక్ష్యం

- ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో మహిళలకు సంక్షేమ పథకాలు
- సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి



మహిళా సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: మహిళలకు అన్నిరంగాల్లో ప్రధాన్యతను ఇస్తూ మహిళాసాధికారతే ధ్యేయంగా బీజేపీ పనిచేస్తున్నదని కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్ బీజేపీ కార్యాలయంలో హైదరాబాద్ సెంట్రల్ ఉపాధ్యక్షురాలు కీర్తిరెడ్డి జూటూరు ఆధ్వర్యంలో మహిళా సంఘాలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రధాని నరేంద్రమోదీ కేంద్రంలో, రాష్ట్రంలో మహిళలకు అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. మహిళలు ఇంటిల్లిపాదితో కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కిషన్‌రెడ్డి కోరారు. నేతలు కాట్‌రాజ్, పాదూరి కరుణ, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫిలింనగర్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ వెంకటేష్

బీఆర్ఎస్‌కు అండగా నిలవండి

ఫిలింనగర్: గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను బురిడీ కొట్టించిందని ఈ పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలబడాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్లండ వెంకటేష్ కోరారు. శుక్రవారం ఆయన ఫిలింనగర్‌లోని పలు బస్తీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సికింద్రాబాద్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు

- అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం



అభివాదం చేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

హిమాయత్‌నగర్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇచ్చి గెలిపించుకుంటామని అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గుంజా శ్రీనివాస్ ప్రకటించారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గుంజా శ్రీనివాస్ మాట్లాడుతూ... వడ్డెర్లు విద్య, సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా పూర్తిగా వెనుకబడి ఉన్నారన్నారు. ఎస్టీల్లో చేర్చకుండా బీసీ కులజాబితాలో వడ్డెర్లని బీసీ(ఏ) గ్రూప్‌లో చేర్చడం వల్ల అన్నివిధాలా నష్టపోతున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్టీ జాబితాలో చేర్చి, వడ్డెరల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావాలని గుంజ శ్రీనివాస్ ఆకాంక్షించారు. జాతీయ ఉపాధ్యక్షులు కుంచాల వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి ఎస్.వెంకటేష్, గ్రేటర్ అధ్యక్షులు రేపని గిరిబాబు, కార్మిక విభాగం అధ్యక్షుడు ఎస్.గోపాల్, జాతీయ మహిళా అధ్యక్షురాలు వి. తిరుమలాదేవి పాల్గొన్నారు.

హోరెత్తిన ఎన్నికల ప్రచారం

లోక్‌సభ ఎన్నికల ప్రచారపర్వం ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో ముమ్మరంగా సాగుతోంది. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం బరిలో ఉన్న ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు, ఆయా పార్టీల నాయకులు రెండు నియోజకవర్గాల పరిధిలో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. ప్రచారంలో ప్రత్యర్థులపై ఆరోపణలు, విమర్శలు చేస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

– బంజారాహిల్స్

'బీజేపీతో దేశానికి పెను ప్రమాదం'



బంజారాహిల్స్‌లో ప్రచారం చేస్తున్న గోవిందరావు

బంజారాహిల్స్: బీజేపీతో దేశానికి పెను ప్రమాదం పొంచి ఉందని సికింద్రాబాద్ డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకట గోవిందరావు ఆరోపించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు ఓటు వేసి గెలిపించాలంటూ శుక్రవారం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-10లో కాంగ్రెస్ సీనియర్ నేత ముంజగల విజయ్‌కుమార్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే ప్రజలు కోరి కష్టాలు తెచ్చుకున్నట్లేనన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే దేశం బాగుపడుతుందని వెల్లడించారు. కాంగ్రెస్ నేతలు మచ్చ విజయ్‌కుమార్, నాగరాజ్‌సంతోష్, ప్రవీణ్, పురుషోత్తంరెడ్డి, రాజు, కళ్యాణి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న నవీన్‌యాదవ్

శ్రీనగర్‌కాలనీ: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రజలు స్వచ్ఛందంగా పార్టీలోకి వస్తూ తమ మద్దతును అందిస్తున్నారని జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ నేత నవీన్‌యాదవ్ అన్నారు. శుక్రవారం బోరబండ డివిజన్‌లోని పలుబస్తీల్లో డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ సతీమణి హబీబా సుల్తానాతో కలిసి పాదయాత్ర నిర్వహించి సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా ప్రచారాన్ని నిర్వహించారు. ఎస్ఆర్‌టీనగర్‌కు చెందిన వివిధపార్టీలకు చెందిన వంద కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. నేతలు నర్సింహా, మహేష్‌గౌడ్, ఇబ్రహం, సరళ, కృష్ణవేణి, ఖయ్యూం పాల్గొన్నారు.

ఇండియా కూటమికి మద్దతు



అభివాదం చేస్తున్న క్రిస్టియన్ యూనిటీ ప్రతినిధులు

హిమాయత్‌నగర్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, ఇండియా కూటమికే క్రైస్తవుల మద్దతు ఉంటుందని వాయిస్ ఆఫ్ క్రిస్టియన్ యూనిటీ ప్రకటించింది. బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో యూనిటీ చీఫ్ అడ్వైజర్ బిషప్ విల్సన్ సింగం మాట్లాడుతూ... దేశ ప్రజల శ్రేయస్సు కోసమే తాము ఇండియా కూటమికి అండగా నిలిచామన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో 40 వేలకు పైగా క్రైస్తవ ఓటర్లు ఉన్నారని, కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపు కోసం తాము మద్దతు ఇస్తున్నట్లు వారు స్పష్టం చేశారు. వాయిస్ ఆఫ్ క్రిస్టియన్ యూనిటీ అడ్వైజర్స్ బిషప్ ఆనంద్ కుమార్, జనరల్ సెక్రటరీ డాక్టర్ రాధా మాథ్యూ, సభ్యులు గ్రేస్ వనిలా, డాక్టర్ పద్మ, డాక్టర్ వెంకటరాజు, ఆడమ్ రాజు తదితరులు పాల్గొన్నారు.



ఎన్బీటీ నగర్‌లో మేయర్ విజయలక్ష్మితో కలిసి ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థి దానం

భారీ మెజార్టీతో గెలవబోతున్నాం

సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్

బంజారాహిల్స్: సికింద్రాబాద్ లోక్‌సభ స్థానాన్ని భారీ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోబోతున్నదని ఆ పార్టీ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. బంజారాహిల్స్ డివిజన్ ఎన్బీటీ నగర్‌లో ఆయన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మాజీ క్రికెటర్, కాంగ్రెస్ నేత అజహరుద్దీన్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఎన్నికల్లోనూ బంజారాహిల్స్ డివిజన్ ప్రజలు తనకు అండగా నిలబడతూ భారీ మెజార్టీని ఇస్తున్నారని అభివృద్ధి కోసం, సంక్షేమ పథకాల అమలు కోసం తాను కాంగ్రెస్ నుంచి బరిలో ఉన్నానని ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో కూడా తనకు బంజారాహిల్స్ ప్రజలు హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీ ఇవ్వాలని ఆయన కోరారు. ఎన్బీటీనగర్‌తో పాటు చుట్టుపక్కల ఇంకా కొన్ని అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని గద్వాల్ విజయలక్ష్మి నేతృత్వంలో తాను ఎంపీగా గెలిచిన తర్వాత నిలిచిపోయిన ప్రతీ పనిని పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా స్థానికులు అడుగడుగునా ఆమెకు హారుతులిస్తూ బ్రహ్మరథం పట్టారు.

అభివృద్ధి ఆగిపోకూడదు: దానం నాగేందర్



మద్దతు కూడగట్టుకుంటున్న దానం నాగేందర్

బంజారాహిల్స్: అభివృద్ధి ఆగిపోకూడదు.. సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలుకావాలనే ఉద్దేశంతోనే తాను కాంగ్రెస్ పార్టీలో చేరాన సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రజల మద్దతు కూడగట్టుకుంటున్నారు. తనను నమ్మి సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని, ఈ సీటు గెలిచి సీఎంకు బహుమతిగా ఇద్దామని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల మాటలు నమ్మవద్దని, వారు అభివృద్ధికి ఆమడదూరంలో ఉండి ప్రజలను పట్టించుకునేవారు కారన్నారు. కాంగ్రెస్‌తోనే పూర్తి అభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. వచ్చేది రాహుల్‌గాంధీ ప్రభుత్వమేనన్నారు. సీఎం రేవంత్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ పథంలో దూసుకుపోతుందని తెలిపారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపించి ఆ స్ఫూర్తిని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా స్పందన చూస్తే మెజార్టీ రెండు లక్షల పైచిలుకేనని ధీమా వ్యక్తంచేశారు.

కేంద్రంలో బీజేపీకే అధికారం



ర్యాలీగా వెళుతున్న బీజేపీ నేతలు

శ్రీనగర్‌కాలనీ: కేంద్రంలో బీజేపీ, తెలంగాణలో రెండంకెల స్థానాల్లో బీజేపీ గెలవబోతున్నదని బీజేపీ సీనియర్ నేత రజనీకాంత్ అన్నారు. పంజగుట్ట ప్రతాప్‌నగర్ నుంచి శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రధాని నరేంద్ర మోదీ సభకు ర్యాలీగా వెళ్లిరు. నేతలు చంద్రశేఖర్, అజయ్, దిలీప్, ప్రవీణ్, విక్రమ్, చందు పాల్గొన్నారు.

దానంతోనే బస్తీల అభివృద్ధి



దుర్గా భవానీనగర్‌లో ప్రచారం చేస్తున్న మామిడి నర్సింగ్‌రావు

ఫిలింనగర్: దానం నాగేందర్‌తోనే బస్తీల్లో అభివృద్ధి జరుగుతుందని ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఫిలింనగర్ బస్తీవాసులంతా పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొని దానంకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని సీనియర్ నేత, 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్‌రావు ఓటర్లను కోరారు. శుక్రవారం ఆయన ఫిలింనగర్‌లోని దుర్గా భవానీనగర్, జైల్‌సింగ్‌నగర్, స్వామి వివేకానందనగర్ బస్తీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు ఆకుల రాజు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీఆర్‌హిల్స్‌లో దానం నాగేందర్



ఎస్పీఆర్ హిల్స్‌లో ప్రచారం చేస్తున్న దానం, అజహరుద్దీన్, సీఎస్ రెడ్డి...

రహమత్‌నగర్: కాంగ్రెస్ గెలుపు ఖాయమని సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు. ఎస్పీఆర్‌హిల్స్ గురువారం రాత్రి నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ అజహరుద్దీన్, కార్పొరేటర్ సి.ఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసే కాంగ్రెస్‌ను గెలిపించండి



ఎర్రగడ్డలో ప్రచారం చేస్తున్న దానం నాగేందర్

శ్రీనగర్‌కాలనీ: సంక్షేమం, అభివృద్ధికి పాటుపడే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్ ఓటర్లను కోరారు. శుక్రవారం ఎర్రగడ్డ డివిజన్‌లోని మసీదుల వద్ద మాజీ ఎంపీ మహమ్మద్ అజహరుద్దీన్‌తో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. నేతలు మోసిన్, రవిగౌడ్, నయీమ్ పాల్గొన్నారు.

వెంగళరావునగర్ కార్పొరేటర్ కారు అద్దాల ధ్వంసం



పగిలిన కారు అద్దాలు



మాట్లాడుతున్న కార్పొరేటర్ దేదీప్య

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ జవహర్‌నగర్ బస్తీలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ కారు అద్దాలను పగలగొట్టారు. వివరాలివీ... కార్పొరేటర్ దేదీప్య విజయ్ జవహర్‌నగర్ బస్తీలో శుక్రవారం ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. మసీదు గడ్డ ప్రాంతంలో ఆమె ప్రచారానికి కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డు తగిలారు. దాంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. ఈ క్రమంలో పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు కార్పొరేటర్ కారు అద్దాలను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న మధురానగర్ పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి ఇరువర్గాలకు సర్ది చెప్పి పంపారు. తమను దుర్భాషలాడుతూ, తమపై అకారణంగా దాడులు చేసి కారు అద్దాలను పగలగొట్టిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలంటూ కార్పొరేటర్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

బంగారం దుకాణాలు కిటకిట



శ్రీనగర్‌కాలనీ: అక్షయ తృతీయ సందర్భంగా పంజగుట్ట, సోమాజిగూడలలో బంగారు దుకాణాలు ఆభరణాల కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. అక్షయ తృతీయ రోజున బంగారం కొంటే మంచి జరుగుతుందనే నమ్మకం చాలా మందిలో ఉంది. దీనికితోడు అక్షయ తృతీయ శుక్రవారం రావడంతో మహిళలు పెద్ద సంఖ్యతో బంగారాన్ని కొనుగోలు చేశారు.

నిమ్స్ నర్సులు కూడా నర్సింగ్ ఆఫీసర్లే

- సంచాలకుడు ప్రొఫెసర్ నగరి బీరప్ప
- ఘనంగా అంతర్జాతీయ నర్సెస్ దినోత్సవం

లక్డీకాపూల్: నిజామ్ వైద్య విజ్ఞాన సంస్థలో రోగులకు వైద్య సేవలను అందిస్తున్న నర్సులు కూడా ఇక నర్సింగ్ ఆఫీసర్లుగా పరిగణింపబడతారని సంచాలకుడు ప్రొఫెసర్ నగరి బీరప్ప వెల్లడించారు. శుక్రవారం నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో అంతర్జాతీయ నర్సెస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించా. నిమ్స్ నర్సింగ్ యూనియన్ నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం నిమ్స్ నర్సింగ్ యూనియన్ ఆధ్వర్యంలో నిమ్మో అంతర్జాతీయ నర్సెస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నిమ్స్ టైమ్స్ మ్యాగజైన్‌ను ఆవిష్కరించారు. నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, డీన్ డాక్టర్ లిజ రాజశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతివీర్,, అసోసియేట్ డీన్ డాక్టర్ నాగేశ్వరరావు, యూనియన్ అధ్యక్షురాలు ఆశలత, ప్రధాన కార్యదర్శి ఎస్. విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు. నర్సులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే రాజ్యాంగ పరిరక్షణ

పంజగుట్ట: రాజ్యాంగాన్ని సంరక్షించుకోవాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు గజ్జెల కాంతం, సతీష్ మాదిగ, ఉట్ల వరప్రసాద్ అన్నారు. శుక్రవారం రాత్రి రాజ్యాంగ పరిరక్షణ దండోరా కార్యక్రమం నిర్వహించారు. జీవీకే మాల్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి పంజగుట్ట కూడలి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు డప్పు కళాకారులతో కలిసి డప్పు వాయిద్యాలతో భారీ దండోరా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పంజగుట్ట కూడలి వద్ద మాట్లాడుతూ... బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం మారుస్తామని, రిజర్వేషన్లు తీసేస్తామంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేధావులు, రిజర్వేషన్ ఫలాలు అందుకుంటున్న వారు కాంగ్రెస్‌కు ఓటు వేసి బీజేపీని భూస్థాపితం చేయాలన్నారు.

కాంగ్రెస్‌కు దివ్యాంగ న్యాయవాదుల సంఘం మద్దతు



పంజగుట్ట: అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో పాటు రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని చెబుతున్న కాంగ్రెస్ పార్టీకే తమ సంపూర్ణ మద్దతు అని దివ్యాంగ న్యాయవాదులు ప్రకటించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, రాష్ట్ర దివ్యాంగుల న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు టి.కొమరయ్యలు మాట్లాడుతూ .. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఉన్నప్పుడు దివ్యాంగులకు పెన్షన్‌లు, బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు ఎక్కువగా దివ్యాంగులతో నింపారని గుర్తుచేశారు. అర్హులైన దివ్యాంగ న్యాయవాదులకు గవర్నమెంట్ ప్లీడర్, ఏజీపీ, పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఏపీపీ లాంటి పోస్టుల్లో స్థానం కల్పించాలని, జూనియర్ న్యాయవాదులు ప్రాక్టీస్ మొదలు పెట్టినప్పటి నుంచి రూ. 5 వేల ప్రకారం స్టైఫండ్ ఇవ్వాలని కోరారు.